## క్లుప్తంగా

### మహిళలకు రాత పరీక్ష

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి సేవా సమితి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో టైలరింగ్, మగ్గం, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ తదితర వృత్తి శిక్షణ పూర్తి చేసిన మహిళలకు మంగళవారం సింగరేణి ఉన్నత పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించారు. ఏజీఎం పర్సనల్ (వెల్ఫేర్) కోడూరు శ్రీనివాసరావు పర్యవేక్షించారు. మాట్లాడుతూ... ఉత్తీర్ణులైన వారికి స్వయం ఉపాధి కల్పించేందుకై ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయం వారి ద్వారా సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నామని తెలిపారు.

### ప్రత్యేకాధికారి పర్యటన

**చుంచుపల్లి:** ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పనులను ప్రత్యేకాధికారి బి.సులోచనరాణి పర్యవేక్షించారు. గ్రామాల్లో ఓహెచ్ ఎస్ఆర్ వాటర్ ట్యాంక్ శుభ్రపరుచుట, తాగునీటి క్లోరినేషన్, టెస్టులు నిర్వహించుట, రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ గురించి, కుంటలు, చెరువుల వద్ద ట్యాంక్ బండ్ తదితర ప్రదేశాల్లో చెత్తను తొలగించే పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఈజీఎస్ ఈసీ పిల్లి నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### విధుల్లో చేరిన ప్రత్యేకాధికారులు


తిరుపతయ్య

**పాల్వంచరూరల్:** మండల ప్రత్యేకాధికారిగా జిల్లా ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ జి.తిరుపతయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండల అధ్యక్షుల, ఎంపీటీసీ పదవి ముగియడంతో ఆయన ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు.


శ్రీరామ్

**టేకులపల్లి:** మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్ మంగళవారం టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సులానగర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

### సైన్స్‌ను మానవ వికాసానికి ఉపయోగించాలి

**పాల్వంచ:** సైన్స్‌ను మానవ వికాసానికి ఉపయోగించాలని, విధ్వంసానికి కాదని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వీరభద్రం అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హిరోషిమా, నాగసాకి డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానాన్ని నిత్య జీవితంలో ఉపయోగించాలన్నారు. అణుబాంబుల విధ్వంసం గురించి వివరించారు.

### వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

**కొత్తగూడెంఅర్బన్:** వక్ఫ్ ఆస్తులను చేజిక్కించుకునేందుకు కేంద్రప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరించడానికి ప్రయత్నిస్తోందని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా ఒక ప్రకటనలో ఆరోపించారు. వక్ఫ్ బోర్డుకు ఉన్న స్వయం ప్రతిపత్తి, మత స్వేచ్ఛకు విఘాతం కలిగించేలా చట్టంలో సవరణలకు కేంద్రం ప్రతిపాదనలు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ మేరకు దాదాపు 40 మార్పులు చేయాలనుకున్న కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

### విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**పాల్వంచ:** విద్యుత్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ విద్యుత్ సౌధలో టీజీ జెన్‌కో డైరెక్టర్ అజయ్‌ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యాదాద్రి పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న ఫోర్‌మెన్లను వారి కోరిక మేరకు కేటీపీఎస్, ట్రెనింగ్ సెంటర్, బీటీపీఎస్‌లకు బదిలీ చేయాలని, వైద్య సేవలు మెరుగుపర్చాలని, ఆఫీస్ సబార్డినేట్ నుంచి జేపీఏ, పీఏ నుంచి జూనియర్ అసిస్టెంట్ పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని, వివిధ స్టేషన్లకు బదిలీ అయిన ఆర్టిజన్లను తిరిగి పంపించాలని కోరారు.

### భారీ వర్షం..

**ఇల్లెందురూరల్:** మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి నాలుగు గంటలపాటు కురిసిన భారీ వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. పక్షం రోజులుగా ముసురుగా కురిసిన వర్షంతో చెరువులన్నీ జలకళను సంతరించుకోగా.. రెండు రోజుల విరామం అనంతరం కురిసిన భారీ వర్షంతో చెరువులు మత్తడి పోశాయి. ఇటీవల వేసిన వరినాట్లు నీటమునిపోయాయి. లోతట్టు ప్రాంతాలలో పత్తి, మొక్కజొన్న చేలలోకి వరదనీరు చేరుకుంది. పోలారం అమర్‌సింగ్‌తండా ప్రధాన రహదారిపై పెద్దచెరువు అలుగునీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

# జయశంకర్ బాటలో నడవాలి..


కొత్తగూడెంఅర్బన్: గ్రంథాలయంలో..


పాల్వంచ: నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

విద్యావేత్త, సామాజిక కార్యకర్త, తెలంగాణ స్ఫూర్తి ప్రదాత, సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాలయాల్లో ప్రొఫెసర్ చిత్రపటానికి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. జయశంకర్ ఆలోచనలకు అనుగుణంగానే నేటి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని, 1952 నుంచి ఆయన ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని, 'ఒడవని ముచ్చట'అనే పుస్తకం ద్వారా తన భావజాలాన్ని ప్రచారం చేశారని గుర్తుచేశారు. విద్యార్థి ఉద్యమంలో అడుగులు వేసి.. ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా తన పోరాట చైతన్యాన్ని పాఠాల ద్వారా విద్యార్థులకు బోధిస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చైతన్యాన్ని బతికించి రాష్ట్ర సాధనలో మార్గదర్శిగా నిలిచారని గుర్తుచేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


చుంచుపల్లి: నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ చంద్రశేఖర్‌రావు


పాల్వంచరూరల్: జగన్నాథపురం పీహెచ్‌సీలో


కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో..


జూలూరుపాడు తహసీల్‌లో..


సుజాతనగర్: మండల పరిషత్ కార్యాలయంలో..


సింగరేణి(కొత్తగూడెం): నివాళులర్పిస్తున్న జీఎం శాలేంరాజు


ఇల్లెందు: పోలీస్ స్టేషన్‌లో..

# ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

**సింగరేణి(కొత్తగూడెం):** కొత్తగూడెం ఏరియా పరిధి రైల్వే భూనిర్వాసితులకు కేటాయించిన ఇంటి స్థలంలో (ఆర్‌అండ్‌ఆర్) ఇళ్ల నిర్మాణానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం గ్రామం సర్వే నంబర్ 143లోని భూమిని, ప్రభావిత ప్రాంతంలోని మాయాబజార్, ఎస్ఆర్‌టీ కాలనీ, వనమానగర్‌లో ఇళ్లు కోల్పోయిన వారికి 100 గజాల చొప్పున గత ప్రభుత్వ హయాంలో 347 మందికి పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఏరియా జీఎం శాలేంరాజు, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం సివిల్ రామకృష్ణ, జేకేటీసీ పీఓ శ్రీరమేష్, సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ తావుర్యా నాయక్, మాయాబజార్, వనమానగర్, రుద్రంపూర్ సర్పంచులు పాల్గొన్నారు.

**రుణమాఫీతో రైతాంగం సంతోషంగా ఉన్నారు...**

**చుంచుపల్లి:** రుణమాఫీ విషయంలో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం చుంచుపల్లి హౌసింగ్ బోర్డు సొసైటీ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రైతులకు కొత్త పంటరుణాలు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ పథకం కింద రెండు విడతల్లో నిధులను రైతుల ఖాతాలో జమ చేశారని చెప్పారు. రైతు రుణమాఫీ పథకాన్ని ప్రతీ రైతుకు వర్తింపజేయాలని, తిరిగి నూతన రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దొండపాటి వెంకటేశ్వరరావు, కొత్వాల శ్రీనివాస్‌రావు, కాసాని అయిలయ్య, నాగ సీతారాములు, కూచిపూడి జగన్నాథరావు, బ్యాంకు మేనేజర్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

# నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలి

**పాల్వంచ:** 1960–65లో అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ప్లాంట్ నిర్మాణం కోసం భూసేకరణ చేశారని, భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి 60 ఏళ్లు అయినా ఉద్యోగాలు కల్పించలేదని కేటీపీఎస్ భూనిర్వాసితులు ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కేటీపీఎస్ ఓఅండ్ఎం 'ఎ'స్టేషన్, రైల్వే ట్రాక్, శేఖరం బంజర రైల్వే ట్రాక్, కిన్నెరసాని ప్రాజెక్ట్ తదితర నిర్మాణాలు జరిగినట్లు చెప్పారు. నిర్వాసితులకు ఉద్యోగాల ఆశ చూపించారని, తర్వాత ఇవ్వలేదన్నారు. 2009లో ఎమ్మెల్యే కూనంనేని భూ నిర్వాసితుల కోసం మూడు రోజుల నిరాహార దీక్ష చేశారని, దీంతో కొత్తగా నిర్మించే 7వ దశ కర్మాగారంలో ఉద్యోగాలు ఇస్తామని కేటీపీఎస్ అధికారులు లిఖిత పూర్వక హామీ ఇచ్చి విస్మరించారని విమర్శించారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బోళ్ల అనుదీప్, కాల్వ సుధాకర్, బుడగం సత్యనారాయణ, బుడగం మల్లికార్జున్, బొమ్మకంటి వీరభద్రం, బంగారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# అభివృద్ధికి సహకరించండి..


కలెక్టర్‌ను సన్మానిస్తున్న చైర్మన్ డీవీ, ఎమ్మెల్యే కోరం కనకయ్య

**ఇల్లెందు:** గ్రామ పంచాయతీల నుంచి మున్సిపాలిటీలో కలిసిన వార్డుల అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయనను కలిసి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సుభాష్‌నగర్‌లో సత్యనారాయణపురం, 24 ఏరియలో కొంతభాగం మున్సిపాలిటీలో కలిసిన వార్డుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. మట్టి రోడ్లు వర్షాలకు గుంతలమయంగా మారాయని, బురదమయం కావటం వల్ల నడిచేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. సాధ్యమైనంత వేగంగా డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించాలని కోరారు.

# శాస్త్రీయ విద్య కోసం పోరాడాలి

**పాల్వంచరూరల్:** విద్యారంగంలో సామాజిక, ఆర్థిక, అసమానతలు లేని విద్యావిధానం కోసం కొట్లాడాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు గోపాలకృష్ణ అన్నారు. పెద్దమ్మగుడి వద్ద ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతుల ప్రారంభ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీరభద్రం, సంద్ర భూపేందర్, భవ్య, మంద నాగకృష్ణ, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టండి..

**పాల్వంచ:** వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఫిల్టర్ బెడ్ వద్ద నీటి శుద్ధి పకడ్బందీగా జరగాలని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీలోని కరకవాగు ఫిల్టర్ బెడ్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నీటి క్లోరినేషన్‌ను పరిశీలించారు. మాట్లాడుతూ.. తాగునీరు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి సరఫరా చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.

**రీజినల్ డైరెక్టర్ తనిఖీ..**

ఫిల్టర్ బెడ్‌ను మున్సిపల్ వరంగల్ రీజియన్ రీజనల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ క్లోరినేషన్‌ను పరిశీలించారు. పలు గృహాలను సందర్శించి తాగునీటిని తనిఖీ చేశారు. అనంతరం రాతిచెరువు కట్టపై, చెత్తచెదారాన్ని తొలగించే పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ డి.డాకునాయక్ నాయక్ మున్సిపాలిటీ కార్యాలయంలో సిబ్బందికి నీటి సేకరణ గుంతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈ స్వరూపరాణి, మేనేజర్ ఎల్‌వి.సత్యనారాయణ, టీపీఓ సత్యనారాయణ, ఎస్ఐ లక్ష్మణ్‌రావు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ఫరీదు పాల్గొన్నారు.

**దోమల నివారణకు ఇంకుడు గుంతలే పరిష్కారం**

**పాల్వంచరూరల్:** వానాకాలంలో సీజనల్ వ్యాధులు, దోమల నివారణకు ఇంకుడు గుంతల నిర్మాణమే పరిష్కార మార్గమని మండల ప్రత్యేకాధికారి జి.తిరుపతయ్య సూచించారు. మండల పరిధి బస్వతారక కాలనీలో మంగళవారం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి స్వచ్ఛతను, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పరిశీలించారు. మాట్లాడుతూ.. నీళ్లు నిల్వ ఉండే ప్రదేశంలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ రంగా, ఏపీఎం.రాంబాబు, కార్యదర్శి రాంబాబు, ఉపాధి హామీ సిబ్బంది రజిత, లక్ష్మి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


కొత్తగూడెంఅర్బన్: ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న షాహిద్ మసూద్

**కొత్తగూడెంఅర్బన్:** భూగర్భ జలాలు ఇంకిపోకుండా ఉండాలంటే ప్రతీఒక్కరు ఇళ్లల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన పలు వార్డులలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషాంజనేయ స్వామి, డీఈ రవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సేవలు మరువలేనివి..


ఉద్యోగులతో చైర్మన్ చంద్రశేఖర్‌రావు

**చుంచుపల్లి:** జిల్లా పరిషత్ చైర్మన్‌గా కొనసాగిన తన పదవీకాలంలో కార్యాలయ ఉద్యోగులు అందించిన సేవలు మరువలేనివని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితంలో ఎన్నో పదవులలో పనిచేసే అవకాశం పొందానని, తెలంగాణ ఉద్యమంలో కూడా కీలక పాత్ర పోషించినట్లు చెప్పారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవాలు తనకు సంతృప్తి కలిగించాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ కె.చంద్రశేఖర్, కార్యాలయ సూపరింటెండెంట్ కె.అరుణ, పీవీకే ప్రసాద్, సిబ్బంది వెల్డి ప్రసాద్, మహమ్మద్ నయీమ్, చైర్మన్ క్యాంప్ క్లర్క్ వై.శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్‌పీఎస్‌టీ నూతన కార్యవర్గం ఎన్నిక

**జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్(ఎఫ్‌పీఎస్‌టీ) నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం పాత పాల్వంచ జెడ్పీహెచ్ఎస్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా జెడ్పీహెచ్ఎస్ చాతకొండ ఫిజికల్ సైన్స్ టీచర్ షేక్ అమీరుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జూలూరుపాడు మండలం కాకర్ల జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ సైన్స్ టీచర్ బి.సంపత్ కుమార్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఎ.నాగరాజు శేఖర్, గౌరవ కార్యదర్శిగా ఎస్కే సైదులు, రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా వై.సంగమేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎ.శంకర్, జాయింట్ సెక్రటరీలుగా ప్రభుసింగ్, బి.బిచ్చా, పి.లీల, బి.బాసు, ట్రెజరర్‌గా జి.శంకర్ మహదేవన్‌లను ఎన్నుకున్నారు.

# కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న ప్రజలు

**ఇల్లెందురూరల్:** అటవీశాఖ అధికారులు గుడిసెవాసులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి అబ్దుల్ నబీ డిమాండ్ చేశారు. మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్ తండా గ్రామ శివారు గుడిసెవాసులు అటవీశాఖ అధికారుల చర్యల పట్ల మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న గుడిసెవాసులకు ఇంటి నంబర్లు, తాగునీరు, విద్యుత్, రోడ్లు, కాల్వలు వంటి కనీస సౌకర్యాలు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం తాము అధికారుల చుట్టూ తిరుగుతుండగా అటవీశాఖ అధికారులు గుడిసెవాసుల వద్దకు వెళ్లి ఇక్కడ ఎవరూ ఇల్లు నిర్మించుకోవద్దని, ఇది అటవీశాఖకు భూమని చెప్పడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తక్షణం ఉన్నతధికారులు స్పందించి గుడిసెవాసులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, రాందాస్, హుస్సేన్, వెంకన్న, యాకూబ్, పాష, కోటమ్మ, సుజాత, రాణి తదితరులు పాల్గొన్నారు.

# షరతులు లేకుండా రుణాలు మాఫీ చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

**టేకులపల్లి:** జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో రైతులకు ఇచ్చిన రుణాలను ఎటువంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సహకార బ్యాంకు సీఈఓ రుణమాఫీ పొందిన సభ్యులు పట్టాదారు పాసుపుస్తకాలు, ధరణి 1బి, 15 సంవత్సరాల ఈసీ, ఆధార్ కార్డు, పాన్ కార్డు, రేషన్ కార్డు, డీసీసీబీ బ్యాంకు, పాస్‌ఫొటో, లోను పుస్తకం తీసుకురావాలని షరతులు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఏజెన్సీ ప్రాంతంలో సాగు భూమి ఖాస్తులో ఉన్న వారికి, పోడు భూములకు రుణాలు పొందిన గిరిజన, గిరిజనేతరులకు సీఈఓ చెప్పిన పత్రాలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఉన్న రుణాలన్నీ మాఫీ చేసిందని, సహకార బ్యాంకులో ఇలాంటి కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. వెంటనే రుణమాఫీ అయిన రైతులందరికీ రీషెడ్యూల్ చేసి రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, కుంజ రమేష్, పూనెం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**ఇల్లెందు:** జనగామలో న్యాయవాదుల దంపతుల పట్ల పోలీసుల దురుసు ప్రవర్తనకు నిరసనగా ఇల్లెందు కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. మంగళవారం కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఓ కేసు విషయమై పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులపై అక్కడి పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని తెలిపారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో న్యాయవాదులు ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్, ఎస్.మల్లికార్జున్‌రావు, మేకల దుర్గయ్య, పి.బాలకృష్ణ, కలవల సుధాకర్, పీవీ నర్సయ్య, ఐలయ్య, సత్యనారాయణ, వి.వెంకటేశ్వర్లు, జయప్రకాష్, వీరేందర్, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

**సీఐని సస్పెండ్ చేయాలి**

**కొత్తగూడెంటౌన్:** జనగామ జిల్లాలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడి హేయమైన చర్య అని, సీఐ రఘుపతిని సస్పెండ్ చేయాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెం జిల్లా కోర్టులోని లైబ్రరీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో తోట మల్లేశ్వరావు, ఎంఎస్ఆర్ రవిచంద్ర, సాధిక్‌పాషా, డి.రవికుమార్, నల్లమల్ల ప్రతిభ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పులిబొమ్మకు శిలాఫలకం తొలగింపు

**పాల్వంచరూరల్:** పెద్దమ్మతల్లి ఆలయం వద్ద 30 ఏళ్ల క్రితం అప్పటి భక్తసమాజం నిర్వాహకులు పులిబొమ్మను ఏర్పాటు చేశారు. అయితే, రోడ్డు విస్తరణలో భాగంగా బొమ్మను తొలగించి మరోచోట ఏర్పాటు చేయగా.. మంగళవారం దాతల పేర్లతో శిలాఫలకాన్ని అమర్చారు. ఈ విషయమై ఈఓకు భక్తులు ఫిర్యాదు చేయగా దానిని తీయించారు.

### పీహెచ్‌సీ తనిఖీ

**పాల్వంచరూరల్:** జ్వరాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించాలని, వైద్యసిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్ ఆదేశించారు. జగన్నాథపురం పంచాయతీ పెద్దమ్మగుడి ఎదుట గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మాట్లాడుతూ.. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.

### వైద్యశిబిరం

**పాల్వంచరూరల్:** కిన్నెరసాని గ్రామపంచాయతీ రాజాపురం గ్రామంలో మంగళవారం ఉల్వనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ తేజశ్రీ 53 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా.. 21మందికి మలేరియా నెగిటివ్‌గా నిర్ధారణ అయిందని తెలిపారు.

### అద్దెకు ఆర్టీసీ బస్సులు

**సుజాతనగర్:** ఆర్టీసీ కొత్తగూడెం ఆధ్వర్యంలో విహారయాత్రలు, ఫంక్షన్లకు అద్దె ప్రాతిపదికన తక్కువ ధరకే బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు విలేజ్ బస్ ఆఫీసర్ ఎస్కే రఫీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9010374644 నంబరులో సంప్రదించాలన్నారు.

### నేడు విద్యుత్ సదస్సు

**జూలూరుపాడు:** బుధవారం చంద్రుగొండ రైతు వేదికలో విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు జూలూరుపాడు ఎన్‌పీడీసీఎల్ ఏఈ సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం ఆధ్వర్యంలో జరిగే సదస్సులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చుటం, ఓల్టేజ్ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, వాడకానికన్నా అధిక విద్యుత్ బిల్లులు, కేటగిరి మార్పు వంటి సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

# వైద్యశిబిరాలు పెంచండి..


మాట్లాడుతున్న డాక్టర్ సుకృత

**ఇల్లెందురూరల్:** ప్రస్తుతం విషజ్వరాలు అధిక సంఖ్యలో నమోదవుతున్నందున గ్రామాలలో వైద్య శిబిరాలు పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుకృత సూచించారు. మండలంలోని కొమరారం, రొంపేడు పీహెచ్‌సీలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రులలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో రోజువారీ ఓపీ, జ్వరపీడితుల సంఖ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది జ్వరపీడితుల పట్ల జాగ్రత్తలు పాటించేలా ఆదేశించాలని చెప్పారు. జ్వరాలు అధిక సంఖ్యలో నమోదవుతున్న గ్రామాలను గుర్తించి ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించి అదుపులోకి తెచ్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత, డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.